క్లుప్తంగా

నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

పార్వతీపురం టౌన్: రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పాచిపెంట మండలం పి. కోనవలసకు శనివారం రానున్నారు. పి.కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జరుగుతున్న అండర్ 17, 19 బాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

విధుల్లోనే ఉన్నాం...

సీతానగరం: వలంటీర్లు సమ్మె చేస్తున్నారని కొంతమంది చేస్తున్న ప్రచారం అంతా అబద్ధమని, తామంతా విధుల్లోనే ఉన్నామని పలువురు వలంటీర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు పెదబోగిలి 1,2 సచివాలయాల వలంటీర్లు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌ను శుక్రవారం కలిసి, వివరణ ఇచ్చారు.

పనుల కల్పనపై అవగాహన తప్పనిసరి

సీతానగరం: ఉపాధి వేతనదారులకు పనులు కల్పించే విషయంలో మేట్లు అవగాహన కలిగి ఉండాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేట్లకు టీఓటీల ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతనదారులకు పనులు కల్పించడం, ఆన్‌లైన్ విధానంలో మస్తర్లు వేయడం, కొలతలు పక్కాగా తీసుకోవడం వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాబ్‌కార్డులున్న వారిందరికీ ఉపాధి పనులు కల్పించడానికి మేట్‌లు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, కంప్యూటర్ సహాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, నాగూరు సబ్‌స్టేషన్‌లతో పాటు జియ్యమ్మవలస మండలంలోని చినకుదమ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు గరుగుబిల్లి ఎలక్ట్రికల్ ఏఈ బి.శంకరరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ గోవింద

వీరఘట్టం: స్థానిక పట్టణ ఎస్ఐగా మురపాక గోవింద శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తూరు నుంచి ఇక్కడకు బదిలీపై రాగా, ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎం.వి.రమణ పార్వతీపురానికి బదిలీ అయ్యారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎస్ఐ గోవింద తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించండి



పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించండి అని పోలింగ్ జోనల్ సిబ్బందికి తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో 2019లో జరిగిన ఎన్నికల్లో గుర్తించిన సమస్యలు పునరావృతంగా కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి, ఏఓ వాహిణి, ఆర్అండ్‌బీ జేఈ జగన్మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి



ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల వినియోగంపై తప్పనిసరిగా అందరూ అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావు అన్నారు. మండల కేంద్రంలో బీఎల్‌వోలతో కలిసి, రెవెన్యూ సిబ్బంది ఈవీఎంల వినియోగంపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈవీఎం ఆధారంగా ఏ పార్టీ గుర్తుకి ఏ విధంగా ఓటు వేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈవీఎం ద్వారా వేసే ఓటు చెల్లకుండా ఉండదని, అందరూ ఓటు పక్కాగా పడుతుందన్నారు.

మాట తప్పని నాయకుడు జగన్..



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర



గ్రామంలో పర్యటిస్తున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, మావుడి సోదరులు

• డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: మాట తప్పని, మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని డీ.శిర్లాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు పొందని లబ్ధిదారులను గుర్తించి, ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. సత్వరమే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలోని యాదవవీధిలో ఇంటి ముంగిట విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని కాలనీవాసులు తెలపగా, సమస్య పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకు మహిళలు కుంకుమలద్ది, హారతులిచ్చారు. జనవరి ఒకటి నుంచి పింఛన్ మూడు వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పడంతో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్ గేదెల రాధిక, ఎంపీటీసీ సభ్యుడు వంగపండు అప్పలనాయుడు, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ. సూర్యనారాయణ, ఏఓ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సన్నీబాబు, హౌసింగ్ ఏఈ సింహాచలం, సాలూరు, మక్కువ నాయకులు దండి శ్రీనివాసరావు, పెంట సంజీవునాయుడు, గేదెల వెంకట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుపై విస్తతంగా ప్రచారం నిర్వహించాలి

ప్రభుత్వం జనవరి 1వ తేదీ నుంచి పింఛన్‌దారులకు మూడు వేల రూపాయలు ఇవ్వనుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. జనవరి 1, 2 తేదీల్లో పింఛన్ సొమ్ము పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాల ఉద్యోగులు, వలంటీర్లు తీసుకోవాలన్నారు. మూడో తేదీన పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందించనున్న సందేశాన్ని టీవీల ద్వారా సచివాలయాలు, ఆర్‌బీకేలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వీక్షించాలని సూచించారు. 4వ తేదీ నుంచి పెంచిన పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

పేరు మార్పుపై చార్జీలు తగ్గించాలి

• కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్



మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం

పాచిపెంట (సాలూరు): సాలూరు మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను పేరు మార్పుపై ఉన్న ఒక శాతం చార్జీని తగ్గించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ముక్తకంఠంతో ఈ అంశంపై డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ, పట్టణంలో ఇళ్లు అమ్మకమైన తర్వాత పేరు మార్పుకు సంబంధించి వసూలు చేస్తున్న చార్జీలు అధికం కావడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. అభివృద్ధి చెందిన పట్టణాల్లో పన్ను అరశాతం ఉంటే వెనుకబడిన పట్టణంలో ఒక శాతం వసూలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయమై కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, ఫ్లోర్‌లీడర్ గొర్లి జగన్ మోహనరావులు మద్దతు పలికారు. దీనిపై కమిషనర్ జయరామ్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను పేరు మార్పుకు సంబంధించి ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీ అయినందున ఇప్పుడు తగ్గింపు సాధ్యం కాదని స్పష్టం చేశారు. కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని సభ్యులు డిమాండ్ చేశారు. 29 వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ అధికారులను నిలదీశారు. ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ సూరినాయుడు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, సింగారపు ఈశ్వరరావు గొల్లపల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితం నాశనం చేసుకోవద్దని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతే దేశాభివృద్ధికి కీలకమని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే దేశం పరిస్థితి అగమ్యగోచరమవుతుందన్నారు. అందరూ మద్యం, ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న భద్రగిరి సీహెచ్‌సీ అడాల్‌సిస్ హెల్త్ కౌన్సిలర్ కె.ప్రమీల విద్యార్థులతో మాట్లాడుతూ ఆడపిల్లల శారీరక, మానసిక సమస్యలు, భావోద్వేగాలు, నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లెక్చరర్ డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి పయనం



గుమ్మలక్ష్మీపురం నుంచి నేత్ర శస్త్రచికిత్సకు పయనమైన రోగులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ఆస్పత్రి నుంచి మండలానికి చెందిన పలువురిని నేత్ర శస్త్రచికిత్సకు విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో కెటరాక్ట్, టెరీజియం వంటి కంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించడం జరిగిందని, వారిని ఇప్పుడు ఆపరేషన్‌కు పంపించడం జరిగిందన్నారు. రోగులకు ఉచితంగా ఆపరేషన్ చేయించడంతో పాటు రవాణా, భోజనం, వసతి సౌకర్యాలు కూడా కల్పించడం జరుగుతోందన్నారు. చికిత్స అనంతరం కళ్లద్దాలు, మందులు కూడా పంపిణీ చేయనున్నామన్నారు.

కొలతల ప్రకారం 'ఉపాధి' పనులు



గుమ్మలక్ష్మీపురం: మేట్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: నిర్దేశిత కొలతల్లో ఉపాధి హామీ పథకం పనులు చేయించాలని ఎంపీడీవో సాల్మన్‌రాజు మేట్‌లకు సూచించారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం, మండ, పి.ఆమిటి గ్రామపంచాయతీలకు చెందిన ఉపాధి హామీ పథకం పనుల మహిళా మేట్లకు పనుల నిర్వహణపై శుక్రవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని, పనిలోకి వచ్చిన వారికి మస్తర్లు వేయాలని, కొలతల ప్రకారం పనులు జరిగి, వేతనదారులకు గిట్టుబాటు అయ్యే వేతనం లభ్యమయ్యేలా చూడాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా వేతనదారుల హాజరు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ జి.చంద్రయ్య, ఏపీవో శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' మేట్‌లకు శిక్షణ..

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగిలో తుంబలి, అల్లువాడ, పిప్పలబద్ర, తాళ్లదుమ్మ, చినమేరంగి గ్రామాల ఉపాధి హామీ పనుల మేట్‌లకు, కుదమలో చింతలబెలగాం, పరజపాడు, బాసంగి గ్రామాల మేట్‌లకు ఉపాధి హామీ పనుల నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. పనులు ఎలా చేయించాలి, ఎలా చేయిస్తే వేతనదారులకు గిట్టుబాటు వేతనం లభిస్తుంది, మస్తర్లు ఎలా వేయాలన్న అంశాలపై మేట్లకు అవగాహన కల్పించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందివ్వడం జరుగుతోందని ఎంపీడీవో డొంక త్రినాధులు అన్నారు. శుక్రవారం మండలంలోని బుక్కూరు, ఎల్ఎల్ పురం, తమటాపల్లి గ్రామాల్లో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలపై లబ్ధిదారుల వద్దకు ఎంపీడీవో వెళ్లి, ఆరాతీశారు. అర్హులకే ప్రభుత్వ ఫలాలు అందాలన్న సదుద్దేశ్యంతో ఈ పరిశీలన జరుగుతోందని, లబ్ధిదారులు సహకరించాలన్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా 88 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, జనవరి 1వ తేదీ నుంచి కొత్త పింఛన్లు అందించనున్నామన్నారు.

సీఎం జగన్‌తోనే గిరిజనుల అభివృద్ధి

• అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



కురుపాం మండలంలోని జిశివడ-కోటకొండ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజనుల అభివృద్ధి అయినా, గిరిజన ప్రాంతాల అభివృద్ధి అయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మరిపల్లి నుంచి నాగరగూడకు రూ.1.60 లక్షలతో, జి శివడ నుంచి కోటకొండ వరకు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన గ్రామాలు ఇప్పుడిప్పుడే ప్రగతి బాట పడుతున్నాయన్నారు. గిరిశిఖర గ్రామాలకు సైతం రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. ప్రతీ గ్రామం, ప్రతీ వర్గం ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, ఆ దిశగా ఆయన అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గతంలో టీడీపీని నమ్మి, ఎంత మోసపోయారో ప్రజలకు బాగా తెలుసన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే ఘనవిజయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌరీశంకరరావు, సర్పంచ్ రాజయ్య, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీ విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, పార్వతీపురం ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకటరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి పనులు



వెంకటాపురం వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న అంటిపేట జంక్షన్ నుంచి వెంకటాపురం మీదుగా వెన్నెల బుచ్చింపేటకు వేస్తున్న బీటీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు అంటిపేట పంచాయతీ సర్పంచ్ జి. తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్. నిర్మల, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ మహేశ్వరరావు, వీఆర్ఎస్ చానల్ మాజీ చైర్మన్ వి. దానబాబు రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రోడ్డు పనులకు రూ. 3 కోట్లు మంజూరు చేసిందన్నారు. అంటిపేట నుంచి వెన్నెల బుచ్చింపేట మీదుగా బొబ్బిలి మండలం కోమటిపల్లి వరకు ఉన్న రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో రాకపోకలకు ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఎట్టకేలకు రోడ్డు పనులు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు.

తెగుళ్లపై అప్రమత్తం

• ఏఓ అవినాష్



కాశీపేటలో పైర్లను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: అపరాల పంటలకు ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. మండలంలోని కాశీపేట, లచ్చయ్యపేట, అంటిపేట గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పెసర, మినప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 180 హెక్టార్లలో పెసర, 600 హెక్టార్లలో మినప సాగవుతోందన్నారు. అపరాల పంటలు ఏపుగా పెరుగుతున్న సమయంలో ఆకుమచ్చ తెగులు, చిత్తపురుగు తెగులు, ఆకుముడత తెగులు ఆశిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆకుముడత తెగులు నివారణకు కాపరాక్సీక్లోరైడ్ 200 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. త్రిప్స్ తెగులు నివారణకు 200 లీటర్ల నీటిలో 5 గ్రాముల థయోమిథాక్సిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. చిత్తపురుగు తెగులు నివారణకు 200 లీటర్ల నీటితలో 500 ఎం.ఎల్ క్లోరిఫైరిపాస్ మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

• డీఈఓ ప్రేమ్ కుమార్



మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సీతానగరం: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేపట్టాలని డీఈఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న సబ్జెక్ట్ కాంప్లెక్స్ (సాంఘిక శాస్త్రం)లో ఆయన మాట్లాడుతూ, త్వరలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడానికి సన్నద్ధం కావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీ చేయండి



ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను అందజేస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను త్వరితగతిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల్లోని లబ్ధిదారులకు అందివ్వాల్సిన ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను సచివాలయ కార్యదర్శులకు ఎంపీడీవో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో 8,381 మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు వచ్చాయని, వీటిని త్వరగా వారికి అందివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జి.జగదీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని కొండబారిడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పత్తిక అప్పారావును ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పరామర్శించారు. ఆయన తల్లి పత్తిక చిన్నమ్మి ఇటీవల మృతి చెందగా, ఎమ్మెల్యే శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ప్రతీ విద్యార్థి 80 శాతం మార్కులు సాధించాలి

• డిప్యూటీ ఈవో కృష్ణమూర్తి

వీరఘట్టం: పదో తరగతి పరీక్షల్లో ప్రతీ విద్యార్థి 80 శాతం మార్కులు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని పాలకొండ డిప్యూటీ ఈవో కృష్ణమూర్తి సిబ్బందికి సూచించారు. మండలంలోని తలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేయాలని తెలిపారు. మ్యాపింగ్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే సులభంగా మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఉప్పాడ అప్పారావు, వీరఘట్టం, పాలకొండ మండలాల సోషల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన..

సీతంపేట: మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సూర్యచంద్రమౌళి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థులకు వివిధ ప్రశ్నలు వేసి, వారి విద్యాసామర్థ్యాలను అంచనావేశారు. పిల్లలు ఇంగ్లిష్ కాస్త బాగా చదువుతుండడంతో ఎంఈవో విద్యార్థుల విద్యాప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.